# హెచ్ఎం అనుమతి లేకుండానే రాఘవపురం పాఠశాల ఉపాధ్యాయురాలిపై గైహాజరు ఆరోపణలు




**ఆళ్లపల్లి, జూలై11 (ప్రజాజ్యోతి)** మండల పరిధిలోని రాఘవపురం ఎంపీపీఎస్ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఓ ఉపాధ్యాయురాలు హెచ్ఎం అనుమతి పొందకుండానే చైల్డ్ కేర్ లీవ్ పేరుతో గత ఐదు రోజులుగా పాఠశాలకు గైర్హాజరవుతున్నారని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సువర్ణ, విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపించారు. ఉపాధ్యాయురాలు సెలవు దరఖాస్తు పత్రం ఇవ్వకపోవడంతో సెలవును ఆమోదించలేదని హెచ్ఎం తెలిపారు. అయినప్పటికీ పాఠశాలకు రాకపోవడం గమనార్హం గతంలో పదో తరగతి మూల్యాంకన విధుల్లో ఉన్న సమయంలో కూడా పాఠశాలకు

మిగతా 2 లో...

జాతీయ తెలుగు దినపత్రిక



ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

భద్రాద్రి కొత్తగూడెం

ఆదివారం | 12 | జులై | 2026 ◆ పేజీలు : 4



# సారపాకలో అస్తవ్యస్తంగా రోడ్ల నిర్మాణం

**అభివృద్ధి నా? అవినీతి నా? అంటూ పలు విమర్శలు..**

**పట్టించుకోని నూతన పాలకవర్గం..**

**బూర్గంపహాడ్, జూలై 11 (ప్రజాజ్యోతి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపహాడ్ మండలంలోని సారపాక మేజర్ పంచాయతీలో అభివృద్ధి పనులు అపహాస్యం పాలవుతున్నాయి. లక్షల రూపాయల నిధులు వెచ్చిస్తున్నా, క్షేత్రస్థాయిలో నాణ్యత లేకపోవడంతో స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**నాణ్యతకు తిలోదకాలు - అస్తవ్యస్త పనులు**

కొత్తగా వేస్తున్న సీసీ రోడ్లకు క్యూరింగ్ (వాటరింగ్) చేయాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు. ఫలితంగా రోడ్డు గట్టిపడేందుకు తమ ఇంటి ముందు వాటరింగ్‌ను స్థానికులే సొంతంగా చేసుకునే దుస్థితి నెలకొంది. విజయనగరం కాలనీలో రోడ్డు మధ్యలోనే విద్యుత్ స్తంభాన్ని ఉంచి పనులు పూర్తి చేయడం అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్ట గా తెలుస్తోంది. రోడ్డుకు ఇరువైపులా మట్టి పోయకపోవడంతో

మిగతా 2 లో...

# మార్చి నాటికి రాష్ట్రవ్యాప్తంగా భూ రీ-సర్వే పూర్తి చేయాలి



**మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి**

**భూ భారతి విజయవంతమైన అమలుకు భూ రీ-సర్వేనే కీలకమని స్పష్టం.**

**లైసెన్స్ సర్వేయర్లకు ఎకరానికి రూ.60 చెల్లింపు.**

**సాదాబైనామా, ఇందిరమ్మ ఇళ్లు, 2బీహెచ్‌కే ఇళ్లపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్.**

**భద్రాద్రి జిల్లాలో తొలి దశలో 14 గ్రామాల్లో రీ-సర్వే వేగవంతం.**

**కొత్తగూడెం కలెక్టరేట్, జూలై 11, ప్రజాజ్యోతి:** భూ భారతి చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలంటే రాష్ట్రవ్యాప్తంగా భూ రీ–సర్వేను అత్యంత ప్రాధాన్యతతో చేపట్టాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార & పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం ఖమ్మం జిల్లా కలెక్టరేట్ నుంచి నిర్వహించిన రాష్ట్రస్థాయి వీడియో కాన్ఫరెన్స్‌లో అన్ని జిల్లాల కలెక్టర్లతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ

మిగతా 2 లో...

# హామీలు అడిగితే... బూతులేనా..?

**ప్రజలకు ఇచ్చిన గ్యారంటీల అమలు గురించి మాట్లాడండి.. వ్యక్తిగత విమర్శలు ఎందుకు?: రేగా**

**రైతు భరోసా, రైతు కూలీల సాయం ఎక్కడ?.. హామీలు నెరవేర్చితే ముక్కు నేలకు రాస్తాం**

**అభివృద్ధి చూపించే దమ్ముంటే ఎన్నికలకు రండి.. ప్రజలే తీర్పు చెబుతారు**




**ఉమ్మడి జిల్లాలో 10కి 10 స్థానాలు బీఆర్ఎస్‌దే: మాజీ ఎమ్మెల్యే ధీమా**

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, జులై 11, ప్రజా జ్యోతి :** "ప్రజలు గ్యారంటీలు, ఎన్నికల హామీల గురించి ప్రశ్నిస్తే సమాధానం చెప్పాల్సింది పోయి బూతులు మాట్లాడడం, ప్రతిపక్షాలపై వ్యక్తిగత విమర్శలు

మిగతా 2 లో...

# తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్, సర్వేయర్ లేక రైతుల ఇక్కట్లు

**అశ్వాపురం, జూలై 11,ప్రజాజ్యోతి** అశ్వాపురం: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్, సర్వేయర్ పోస్టులు ఖాళీగా ఉండటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భూముల కొలతలు, హద్దుల నిర్ధారణ, భూ వివాదాల పరిష్కారం, భూభారతి సంబంధిత సమస్యలు నెలల తరబడి పెండింగ్‌లో ఉండటంతో రైతులు కార్యాలయం చుట్టూ తిరుగుతూ అవస్థలు పడుతున్నారు. వ్యవసాయ భూముల పట్టాదారు పాస్‌పుస్తకాల మార్పిడి, వారసత్వ నమోదు, భూమి హక్కుల మార్పిడి, నాలా మార్పిడి




వంటి పనులు పూర్తిస్థాయి అధికారులు లేక ఆలస్యమవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సర్వేయర్ లేకపోవడంతో భూముల కొలతలు, సరిహద్దుల నిర్ధారణ జరగక రైతులు సాగు పనులతో పాటు ఇతర అవసరాల కోసం

మిగతా 2 లో...

## తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్, సర్వేయర్ లేక రైతుల ఇక్కట్లు

(మొదటి పేజీ తరువాయి...)

కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భూమి రికార్డుల్లో ఉన్న లోపాల కారణంగా ప్రభుత్వ పథకాలకు ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకునే సమయంలో సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయని, దీంతో అర్హులైన రైతులు కూడా ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందలేకపోతున్నారని వారు పేర్కొంటున్నారు. ముఖ్యంగా చిన్న, సన్నకారు రైతులు కార్యాలయం చుట్టూ పలుమార్లు తిరగాల్సి రావడం వల్ల సమయం, ధనం వృథా అవుతున్నాయని వాపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి అశ్వాపురం తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్, సర్వేయర్ పోస్టులను తక్షణమే భర్తీ చేసి రైతుల సమస్యలను పరిష్కరించాలని మండల రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు....

## సారపాకలో అస్తవ్యస్తంగా రోడ్ల నిర్మాణం

(మొదటి పేజీ తరువాయి...)

ప్రమాదాలు పొంచి ఉన్నాయి.

### వరదనీటితో ఇక్కట్లు - పారిశుధ్య వైఫల్యం

వర్షం వస్తే రోడ్డు పక్కన కాలువలు లేక ఇళ్లలోకి వరద నీరు వచ్చి చేరుతోంది. ఈ సమస్య పరిష్కారానికి సైడ్ డ్రెయిన్లు నిర్మించాలని స్థానికులు వేడుకుంటున్నారు. మరోవైపు వర్షాకాలం కావడంతో రోడ్లకు ఇరువైపులా పిచ్చిమొక్కలు, ముళ్లకంపలు పెరిగి కాలనీలు అడవిని తలపిస్తున్నాయి. దీనివల్ల దోమలు వృద్ధి చెంది సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

### స్పందించని అధికారులు

పారిశుధ్య చర్యలు చేపట్టడంలో,కనీస వసతులు కల్పించడంలో పంచాయతీ పాలకవర్గం, అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నాణ్యత లేని పనులపై విచారణ జరపాలని, రోడ్ల వెంట ఉన్న పిచ్చి మొక్కలను తొలగించి, పారిశుధ్య పనులు చేపట్టాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు.లేని పక్షంలో ఆందోళనలు తప్పవని హెచ్చరిస్తున్నారు.

## హెచ్‌ఎం అనుమతి లేకుండానే రాఘవపురం పాఠశాల ఉపాధ్యాయురాలిపై గైహాజరు ఆరోపణలు




(మొదటి పేజీ తరువాయి...)

గైర్హాజరైన ఘటనపై జిల్లా విద్యాశాఖ అధికారులు షోకాజ్ నోటీసులు జారీ చేసినప్పటికీ, ఆమె వ్యవహారశైలిలో మార్పు లేదని ఆరోపించారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు మండల విద్యాశాఖ అధికారి కూడా సోకాజ్ నోటీసు ఇవ్వడం జరిగింది తెలిపారు.పాఠశాలకు ఆలస్యంగా రావడంపై ప్రశ్నిస్తే హెచ్‌ఎంతో వాగ్వాదానికి దిగుతారని కూడా పేర్కొన్నారు. అంతేకాకుండా, విద్యాబోధనపై పూర్తి స్థాయిలో దృష్టి పెట్టకుండా తరచూ ఫోన్‌లో మాట్లాడుతుండడం, పాఠశాలకు వచ్చే గ్రామ పెద్దలు, సర్పంచ్, విద్యార్థుల తల్లిదండ్రులకు తగిన గౌరవం ఇవ్వడం లేదని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల విద్యా ప్రయోజనాల దృష్ట్యా సంబంధిత ఉపాధ్యాయురాలిపై చర్యలు తీసుకుని, డిప్యూటేషన్‌పై మరో ఉపాధ్యాయులని నియమించాలని వారు డిమాండ్ చేశారు.ఈ విషయమై మండల విద్యాధికారి (ఎంఈఓ)ను వివరణ కోరగా, చైల్డ్ కేర్ లీవ్ దరఖాస్తు ముందుగా హెచ్‌ఎం సిఫారసుతో తన వద్దకు వస్తేనే అనుమతి మంజూరు చేసే అవకాశం ఉంటుందని తెలిపారు. అయితే, సంబంధిత ఉపాధ్యాయురాలు ఆన్‌లైన్‌లో సెలవు కోసం దరఖాస్తు చేసినట్టుగా విషయాన్ని తనకు తెలియజేసినట్లు పేర్కొన్నారు.

## మార్చి నాటికి రాష్ట్రవ్యాప్తంగా భూ రీ-సర్వే పూర్తి చేయాలి

(మొదటి పేజీ తరువాయి...)



ధరణి స్థానంలో భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చి రైతుల భూములకు పూర్తి భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. భూ భారతి సమర్థవంతంగా అమలవ్వాలంటే భూ రీ-సర్వే తప్పనిసరి అని పేర్కొన్నారు. మార్చి-2027 నాటికి మూడు విడతల్లో రాష్ట్రవ్యాప్తంగా రీ-సర్వే పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. రీ-సర్వేలో పనిచేసే లైసెన్స్ సర్వేయర్లకు ఎకరానికి రూ.50తో పాటు రవాణా, ఇతర ఖర్చుల కోసం మరో రూ.10 కలిపి మొత్తం రూ.60 చెల్లిస్తామని వెల్లడించారు. విధుల్లో చేరని లైసెన్స్ సర్వేయర్లకు గడువు విధించి, అనంతరం లైసెన్సులు రద్దు చేయాలని ఆదేశించారు. ధరణి కాలం నుంచి పెండింగ్‌లో ఉన్న 9.26 లక్షల సాదా బైనామా దరఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని, తిరస్కరణలకు గల కారణాలను గుర్తించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయడంతో పాటు, పెండింగ్‌లో ఉన్న 2బీహెచ్‌కే ఇళ్లను ప్రస్తుత స్థితిలోనే లబ్ధిదారులకు అప్పగించాలని సూచించారు. రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో గుడిసెల్లో నివసించే కుటుంబాలకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. అలాగే ఆగస్టు 15 నాటికి రాష్ట్రంలోని ప్రతి విద్యార్థికి కనీసం ఒక జత యూనిఫాం అందేలా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు.

### భద్రాద్రి జిల్లాలో పురోగతి

వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ అంకిత్ జిల్లాలో భూ రీ-సర్వే పురోగతిని మంత్రికి వివరించారు. అక్కినేపల్లి గ్రామంలో 8,990 ఎకరాల్లో సుమారు 4,900 ఎకరాల సర్వే పూర్తయిందని తెలిపారు. గుండాల మండలంలోని పెద్దవేంకటాపురం, శుభంపేట గ్రామాల్లో కూడా సర్వే పనులు కొనసాగుతున్నాయని వెల్లడించారు. మాదారం గ్రామంలో సోమవారం నుంచి రీ-సర్వే ప్రారంభం కానుందని చెప్పారు. సీతారామ ఎత్తిపోతల పథకం పరిధిలో ఈ నెలలోనే 5,000 ఎకరాలకు భూ సర్వే చేపట్టినట్లు తెలిపారు. జిల్లాలో మొత్తం 17 గ్రామాలకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించగా, తొలి దశలో 14 గ్రామాలను ఎంపిక చేసి పాల్వంచ, గుండాల, పినపాక, దుమ్ముగూడెం, బూర్గంపాడు మండలాల్లో సుమారు 4,000 ఎకరాల సర్వే పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. జిల్లాలో మొత్తం 206 మంది లైసెన్స్ సర్వేయర్లు ఉండగా, వారిలో 56 మంది జిల్లాకు కేటాయించబడ్డారని, ఇప్పటికే 16 మంది విధుల్లో చేరి రీ-సర్వే పనులు నిర్వహిస్తున్నారని కలెక్టర్ తెలిపారు. వారికి రిటైర్డ్ సర్వేయర్ల ద్వారా ప్రత్యేక శిక్షణ అందిస్తున్నట్లు వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కొత్తగూడెం ఆర్డీవో మధు, ఏడి ల్యాండ్ సర్వే అధికారి శ్రీనివాసరావు, తహసీల్దార్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## హామీలు అడిగితే... బూతులేనా..?

(మొదటి పేజీ తరువాయి...)




చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ పాలనగా మారింది" అని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రజలకు ఇచ్చిన మాటలను నిలబెట్టుకోలేకపోతున్న కాంగ్రెస్ ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే బీఆర్ఎస్‌ను లక్ష్యంగా చేసుకుంటోందని ఆయన ఆరోపించారు. శనివారం కొత్తగూడెంలోని బీఆర్ఎస్ జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడిన రేగా, డబ్బు సంచులతో దొరికిన వ్యక్తికి నీతులు చెప్పే నైతిక అర్హత లేదని విమర్శించారు. బీజేపీతో పాటు మీ రాజకీయ గురువు చంద్రబాబుతో చీకటి ఒప్పందాలు చేసుకుని బెయిల్‌పై బయట తిరుగుతున్న మీరు ప్రజలకు సుద్దులు చెప్పే పరిస్థితిలో లేరని వ్యాఖ్యానించారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, దొంగను దొంగగానే చూస్తారని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు పూర్తయినా ఎన్నికల్లో ఇచ్చిన గ్యారంటీల్లో ఒక్క హామీని కూడా పూర్తిస్థాయిలో అమలు చేయలేదని రేగా ఆరోపించారు. అందుకే ప్రజల దృష్టి మళ్లించేందుకు ప్రతిపక్షాలపై విమర్శలు చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యంగా మారిందన్నారు. ముఖ్యమంత్రి ప్రసంగాల్లో ప్రజా సమస్యల కంటే రాజకీయ ప్రత్యర్థులపై విమర్శలే ఎక్కువగా కనిపిస్తున్నాయని ఎద్దేవా చేశారు. రైతు భరోసా పేరుతో రైతులను నమ్మించి రెండేళ్లుగా వారి ఖాతాల్లో ఒక్క రూపాయి కూడా జమ చేయలేదని, రైతు కూలీలకు రూ.15 వేల ఆర్థిక సాయం అందిస్తామని ఇచ్చిన హామీ కూడా అమలు కాలేదన్నారు. రైతు కూలీల ఖాతాల్లో ప్రభుత్వం నిజంగా నిధులు జమ చేస్తే తామంతా ముక్కు నేలకు రాస్తామని, మరి హామీలు నెరవేర్చలేని కాంగ్రెస్ మంత్రులు కూడా అదే చేయడానికి సిద్ధమా అని సవాల్ విసిరారు. రైతులను ఆదుకుంటామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వారినే నట్టేట ముంచిందని రేగా విమర్శించారు. జిల్లాలో మరణించిన రైతుల కుటుంబాలకు ఇప్పటికీ రైతు బీమా అందలేదని, పండించిన పంటను కొనుగోలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. రైతుల కష్టాలపై స్పందించకుండా రాజకీయ సభల్లో ప్రతిపక్షాలను తిట్టడమే ప్రభుత్వానికి పనిగా మారిందని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై ఆరోపణలు చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఇప్పుడు ప్రాజెక్టు మరమ్మతుల గురించి పట్టించుకోకుండా పిల్లర్ల కింద ఇసుక తరలింపును చూస్తూ ఊరుకుందని విమర్శించారు. సీతారామ ప్రాజెక్టు నీటి పంపిణీలో కూడా భద్రాద్రి జిల్లా రైతులకు అన్యాయం జరుగుతోందని, ఈ ప్రాంత ప్రజాప్రతినిధులు స్పందించడం లేదన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో లబ్ధిదారులపై అదనపు భారం మోపుతున్నారని, ఇసుక, సున్నం, మేస్త్రి ఖర్చుల పేరుతో లక్షల రూపాయలు ఖర్చు చేయాల్సిన పరిస్థితి తీసుకొచ్చారని ఆరోపించారు. ఉచిత ఇళ్లు ఇస్తామని చెప్పి పేదలపై ఆర్థిక భారం వేయడం కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. బీఆర్ఎస్ పాలనలో పదేళ్లపాటు రైతులకు నాణ్యమైన విద్యుత్ అందిందని, ఇప్పుడు కరెంట్ సమస్యలతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నరేళ్లలో చేసిన అభివృద్ధి ఏమిటో ప్రజల ముందు చెప్పాలని, నిజంగా ప్రజా మద్దతు ఉంటే అసెంబ్లీని రద్దు చేసి ఎన్నికలకు రావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రేగా సవాల్ విసిరారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలే కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన తీర్పు ఇస్తారని, ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పది అసెంబ్లీ స్థానాల్లో పది స్థానాలను బీఆర్ఎస్ కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో కాపు సీతాలక్ష్మి, కొట్టి వెంకటేశ్వరరావు, సంకుబపన అనుదీప్, వేల్పుల దామోదర్, రాజు గౌడ్, కార్పొరేటర్ సింధు తపస్వి తదితరులు పాల్గొన్నారు.

## ఆదివాసీ విద్యార్థులకు అండగా ప్రత్యేక యూనిఫాంలు

### రజబ్ ఆలీ నగర్ గుంపెన పాఠశాల విద్యార్థులకు మండల విద్యాశాఖాధికారి ఆనంద్ పంపిణీ



**అన్నపురెడ్డిపల్లి, జూలై 11 (ప్రజా జ్యోతి):** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో గల పెద్దిరెడ్డిగూడెం అటవీ ప్రాంతంలోని రజబ్ ఆలీ నగర్ గుంపెన పాఠశాలలో చదువుతున్న ఆదివాసీ విద్యార్థులకు మండల విద్యాశాఖాధికారి ఉండేటి ఆనంద్ కుమార్ శనివారం ప్రత్యేక యూనిఫాంలను పంపిణీ చేశారు. ప్రభుత్వం నుంచి కొత్త యూనిఫాంలు అందే వరకు విద్యార్థులు ఇబ్బందులు పడకుండా ఉండాలనే ఉద్దేశంతో ఈ దుస్తులను అందజేశారు. పాఠశాలలో ప్రస్తుతం 12 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారని ప్రధానోపాధ్యాయులు భూక్యా బాబూలాల్ తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు కొనసాగుతున్నాయని మండల విద్యాశాఖాధికారి పేర్కొన్నారు. త్వరలో పాఠశాలకు మరిన్ని మౌలిక వసతులు కల్పించేలా కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సడియం బాలకృష్ణ, మడకం మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ జనాభా దినోత్సవం పురస్కరించుకుని అవగాహన ర్యాలీ

- చిన్న కుటుంబమే సంతోషకరమైన కుటుంబమని సామాజిక ఆరోగ్య అధికారిణి వాణి సూచన




**అన్నపురెడ్డిపల్లి, జూలై 11 (ప్రజా జ్యోతి):** అన్నపురెడ్డిపల్లి మండలంలోని ఎర్రగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని జనాభా నియంత్రణ, కుటుంబ నియంత్రణ పద్ధతులపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించారు. వైద్య సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు, స్థానిక ప్రజలు ర్యాలీలో పాల్గొని చిన్న కుటుంబం వల్ల కలిగే ప్రయోజనాలు, జనాభా నియంత్రణ ఆవశ్యకతపై నినాదాలు చేస్తూ ప్రజల్లో చైతన్యం కల్పించారు. కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య అధికారిణి వాణి జనాభా పెరుగుదలతో సహజ వనరులపై ఒత్తిడి పెరగడంతో పాటు తాగునీరు, ఆహారం, నివాసం, ఉపాధి వంటి రంగాల్లో సమస్యలు తలెత్తుతున్నాయని వివరించారు. ప్రణాళికాబద్ధమైన కుటుంబంతోనే ఆరోగ్యవంతమైన సమాజం, అభివృద్ధి చెందిన దేశ నిర్మాణం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. చట్టబద్ధమైన వయస్సు వచ్చిన తర్వాతే వివాహాలు జరిపించాలని, ఒక కాన్పుకు మరో కాన్పుకు మధ్య కనీసం మూడు సంవత్సరాల వ్యవధి ఉండేలా చూసుకోవాలని సూచించారు. మహిళల విద్య, ఆర్థిక సాధికారతకు ప్రాధాన్యం ఇవ్వడం, యువతకు పునరుత్పత్తి ఆరోగ్యంపై సరైన అవగాహన కల్పించడం అవసరమన్నారు. ప్రభుత్వ ఆరోగ్య సంస్థల్లో గర్భనిరోధక మాత్రలు, ఛాయా మాత్రలు, నిరోధ్‌లు, కాపర్–టి, గర్భనిరోధక ఇంజెక్షన్లు వంటి తాత్కాలిక కుటుంబ నియంత్రణ పద్ధతులతో పాటు మహిళలకు ట్యూబెక్టమీ, పురుషులకు వాసెక్టమీ వంటి శాశ్వత సేవలు కూడా ఉచితంగా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రతి గర్భధారణ ప్రణాళికాబద్ధంగా ఉండాలని, చిన్న కుటుంబమే సంతోషకరమైన కుటుంబమని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకుడు ప్రకాశరావు, మధ్యస్థాయి ఆరోగ్య సేవల అధికారి లావణ్య, ఆరోగ్య సహాయకుడు కోటేశ్వరరావు, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# సమగ్ర ఓటరు సవరణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

- బానోత్ హరిప్రియ నాయక్



**టేకులపల్లి, జూలై 11,ప్రజాజ్యోతి:** భారత ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ ఐఆర్) కార్యక్రమంలో ప్రతి అర్హ ఓటరు బాధ్యతాయుతంగా పాల్గొని తన ఓటు హక్కును పరిరక్షించుకోవాలని ఇల్లందు మాజీ ఎమ్మెల్యే, బీఆర్ ఎస్ నియోజకవర్గ ఇన్ చార్జి బానోత్ హరిప్రియ నాయక్ పిలుపు నిచ్చారు. శనివారం టేకులపల్లి మండలంలోని దాసుతండాలోని తన స్వగృహంలో ఆమె ఎస్ ఐఆర్ నమోదు ఫారాన్ని స్వయంగా పూరించి స్థానిక బీఎల్ ఓకు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, ఓటర్ల జాబితాను మరింత పారదర్శకంగా, ఖచ్చితం గా రూపొందించేందుకు ఎన్నికల సంఘం ఈ ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి ఓటరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఓటర్లందరూ ఎస్ ఐఆర్ ప్రక్రియపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ఎలాంటి సందేహాలు న్నా సంబంధిత బీఎల్ ఓలను లేదా ఎన్నికల అధికారులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలని ఆమె సూచించారు. స్థానిక బీఎల్ ఓలకు పూర్తిస్థాయిలో సహకరించి అవసరమైన ధ్రువపత్రాలు, వివరాలు అందజేయడం ద్వారా తమ ఓటు హక్కును భద్రపరచు కోవాలని కోరారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైన రాజ్యాంగబద్ధ హక్కు అని, దానిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఓటరిపైనే ఉంటుందని బానోత్ హరిప్రియ నాయక్ పేర్కొన్నారు. 2002 సంవత్సరానికి ముందు ఓటు హక్కు పొందిన వారితో పాటు, 2002 తర్వాత ఓటర్లుగా నమోదైన వారందరూ కూడా ఎన్నికల సంఘం సూచించిన విధంగా ఎస్ ఐఆర్ కార్యక్రమంలో తప్పనిసరిగా పాల్గొని తమ వివరాలను నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఓటరు జాబితాలో ఎలాంటి పొరపాట్లు లేకుండా, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు కొనసాగేందుకు ప్రతి ఓటరు అప్రమత్తంగా ఉండాలని ఆమె అన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటు హక్కు కీలకమని, అందువల్ల ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించి ఎన్నికల సంఘం చేపట్టిన సమగ్ర ఓటరు సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బానోత్ హరిప్రియ నాయక్ పిలుపునిచ్చారు.

# అంబేద్కర్ విగ్రహ ప్రారంభోత్సవానికి సర్వం సిద్ధం

- రేపు మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి చేతుల మీదుగా ఆవిష్కరణ
- ఎమ్మెల్యేలు, కలెక్టర్, ఎస్పీతో పాటు పలువురు ప్రముఖులు హాజరు
- ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని విగ్రహ స్థాపన కమిటీ పిలుపు



**చుంచుపల్లి, జూలై 11 (ప్రజాజ్యోతి )** చుంచుపల్లి మండలంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో నందా తండా గ్రామపంచాయతీ లో నూతనంగా ఏర్పాటు చేసిన భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహ ప్రారంభోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని హౌసింగ్ బోర్డు అంబేద్కర్ విగ్రహ స్థాపన కమిటీ సభ్యులు తెలిపారు. ఈ నెల 12వ తేదీ ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమాన్ని తెలంగాణ కార్మిక, ఉపాధి కల్పన, పరిశ్రమలు, గనులు, భూగర్భ వనరుల శాఖ మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి చేతుల మీదుగా ఘనంగా ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. శనివారం హౌసింగ్ బోర్డు కాలనీలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కమిటీ సభ్యులు మాట్లాడుతూ, అంబేద్కర్ ఆశయాలను భావితరాలకు చేరవేయాలనే సంకల్పంతో కాలనీలో ప్రజల సహకారంతో విగ్రహాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమానత్వం, సామాజిక న్యాయం, రాజ్యాంగ విలువలను ప్రతి ఒక్కరూ ఆచరించాలనే సందేశాన్ని ఈ విగ్రహం సమాజానికి అందిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సంబశివరావు, వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ పటేల్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారని తెలిపారు. ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు, సామాజిక సంస్థల నాయకులు, విద్యార్థులు, యువజన సంఘాలు, మహిళా సంఘాల ప్రతినిధులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొనే అవకాశం ఉందన్నారు. అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ అనంతరం సభ నిర్వహించనున్నట్లు, సభలో అంబేద్కర్ సేవలు, భారత రాజ్యాంగ విశిష్టత, సామాజిక సమానత్వం, వెనుకబడిన వర్గాల అభివృద్ధి వంటి అంశాలపై అతిథులు ప్రసంగించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. హౌసింగ్ బోర్డు కాలనీ ప్రజల సహకారంతో కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చెప్పారు. హౌసింగ్ బోర్డు గ్రామ ప్రజలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంఘాల నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, యువత, మహిళలు, వివిధ స్వచ్ఛంద సంస్థల సభ్యులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కమిటీ సభ్యులు విజ్ఞప్తి చేశారు. అంబేద్కర్ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టి సామాజిక సమానత్వం కోసం కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు. విలేకరుల సమావేశంలో హౌసింగ్ బోర్డు అంబేద్కర్ విగ్రహ స్థాపన కమిటీ అధ్యక్షుడు తుంపూరి శివ, కార్యదర్శి తాండ్ర వెంకటేశ్వర్లు, సభ్యులు శనగ వెంకటేశ్వర్లు, గొనె శ్రీకాంత్, గుర్రం లక్ష్మణ్, గడ్డం రగన్ బాబు, శనగ స్వామి తదితరులు పాల్గొని కార్యక్రమ వివరాలను వెల్లడించారు. కార్యక్రమం విజయవంతం కావడానికి స్థానిక ప్రజలు, దాతలు, యువకులు, కమిటీ సభ్యులు అందరూ సమిష్టిగా కృషి చేస్తున్నారని వారు తెలిపారు.

# అక్రమ ఇసుక రవాణా.. ట్రాక్టర్ సీజ్, కేసు నమోదు




**టేకులపల్లి, జూలై 11,ప్రజాజ్యోతి:** టేకులపల్లి మండలంలోని తడకేలపూడి ఎక్స్‌రోడ్డు వద్ద శనివారం ఉదయం నిర్వహించిన వాహనాల తనిఖీల్లో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకుని సీజ్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మీదేవిపల్లి మండలం రాందాస్ తండాకు చెందిన నూనావత్ రమేష్ (37) టీఎస్ 28 టీ 1656 నంబర్ గల ట్రాక్టర్‌లో ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా శంభునిగూడెం ముర్రేడు వాగు నుంచి ఇసుకను ఇల్లందు వైపు తరలిస్తుండగా పట్టుబడ్డాడు తనిఖీల సందర్భంగా ఇసుక రవాణాకు సంబంధించి ఎలాంటి చెల్లుబాటు అయ్యే అనుమతి పత్రాలు చూపించలేకపోవడంతో ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. అనంతరం సంబంధిత చట్టాల ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు టేకులపల్లి ఎస్ఐ తిరుపతి వెల్లడించారు. అక్రమ ఇసుక రవాణాపై ప్రత్యేక నిఘా కొనసాగుతోందని, సహజ వనరులను అనుమతి లేకుండా తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. మండలంలో అక్రమ ఇసుక రవాణా, నిల్వ, విక్రయాలపై తనిఖీలు కొనసాగుతాయని, ప్రజలు కూడా ఇటువంటి ఘటనలపై సమాచారం అందించి పోలీసులకు సహకరించాలని ఎస్ఐ కోరారు.

# ఆటో కార్మికుల హక్కుల సాధనకు ఐక్యంగా పోరాడాలి: డి. ప్రసాద్




**టేకులపల్లి, జూలై 11, ప్రజాజ్యోతి:** ఆటో కార్మికుల సమస్యల పరిష్కారం, సంక్షేమం కోసం ఐక్యంగా ఉద్యమించాలని తెలంగాణ ప్రగతిశీల ఆటో అండ్ మోటార్ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర నాయకుడు డి. ప్రసాద్ పిలుపునిచ్చారు. బద్దుతండా, నంద్యాతండా, మద్దిరాలతండా, కుంటల, తుమ్మల చెలక గ్రామాల పరిధిలోని ఆటో కార్మికులతో నిర్వహించనున్న జనరల్ బాడీ సమావేశాన్ని అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. టేకులపల్లిలో బానోత్ లక్ష్మణ్ అధ్యక్షతన నిర్వహించిన ఆటో కార్మికుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు ప్రస్తుతం అనేక మంది నిరుద్యోగ యువకులు జీవనోపాధి కోసం ఆటో డ్రైవర్లుగా పనిచేస్తున్నప్ప టికీ, వారికి తగిన ప్రభుత్వ ప్రోత్సాహం, సామాజిక భద్రత, సంక్షేమ పథకాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పెరుగుతు న్న డీజిల్, పెట్రోల్, సీఎన్‌జీ ధరలు, వాహనాల నిర్వహణ వ్యయం, విడిభాగాల ధరలు, ఫైనాన్స్ భారం కారణంగా ఆటో కార్మికులు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఆటో, మోటార్ కార్మికుల కోసం ప్రత్యేక సంక్షేమ బోర్డును ప్రభుత్వం వెంటనే ఏర్పాటు చేసి, ప్రమాద బీమా, ఆరోగ్య భద్రత, పెన్షన్, విద్యా సహాయం వంటి సంక్షేమ పథకాలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. నేడు నిర్వహించే జనరల్ బాడీలో ఆటో కార్మికుల సమస్యలు, భవిష్యత్ కార్యాచరణ, సభ్యత్వ నమోదు, సంఘం బలోపేతం తదితర అంశాలపై చర్చించనున్న ట్లు తెలిపారు. ఈ సమావేశానికి తెలంగాణ ప్రగతిశీల ఆటో అండ్ మోటార్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోడేటి నాగేశ్వరరావు, రాష్ట్ర అధ్యక్షుడు ఎం.డి. రాషుద్దీన్ ముఖ్య వక్తలుగా హాజరై కార్మికులను ఉద్దేశించి ప్రసంగించనున్న ట్లు వెల్లడించారు. ఆటో కార్మికుల హక్కుల పరిరక్షణకు సంఘం నిరంతరం పోరాటం చేస్తుందని, ప్రతి కార్మికుడు సంఘంలో సభ్యత్వం తీసుకుని ఐక్యంగా ఉండాలని డి. ప్రసాద్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మోహన్, రమేష్, తరుణ్, నరేష్, కుమార్, గోపాల్, పుల్‌సింగ్ తదితరులు పాల్గొని జనరల్ బాడీ విజయవంతానికి సహకరించాలని ఆటో కార్మికులను కోరారు.

## రూ.4.5లక్షల ఎల్ఓసీ అందజేసిన ఎమ్మెల్యే పాయం



బూర్గంపహాడ్,జూలై 11,( ప్రజా జ్యోతి ):బూర్గంపహాడ్ మండలం సారపాక భాస్కర్‌నగర్‌కు చెందిన రాయల వీరాంజనేయులుకు వైద్య చికిత్స కోసం మంజూరైన రూ.4.5లక్షల ఎల్ఓసీ పత్రాన్ని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు శనివారం మణుగూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తోందని తెలిపారు.ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఎవరూ వైద్య చికిత్సకు దూరం కాకుండా ముఖ్యమంత్రి సహాయ నిధి, ఎల్ఓసీ వంటి పథకాల ద్వారా ప్రభుత్వం సహాయం అందిస్తోందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## విద్యార్థుల విద్యాభివృద్ధికి ఎస్‌జీటీ వెంకటేశ్వర్లు చేయూత



టేకులపల్లి, జూలై 11,ప్రజాజ్యోతి: విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించాలనే ఉద్దేశంతో టేకులపల్లి మండలంలోని కోయగూడెం ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో ఎస్‌జీటీ ఉపాధ్యాయుడు బి. వెంకటేశ్వర్లు తన సొంత ఖర్చులతో 20 మంది ప్రాథమిక విద్యార్థులకు టేబుల్ బుక్స్ అందజేశారు. పాఠశాల ఉపాధ్యాయుడు డి. నాగేశ్వరరావు చేతుల మీదుగా విద్యార్థులకు వాటిని పంపిణీ చేశారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యార్థులు చదువుపై మరింత శ్రద్ధ చూపి ఉన్నత లక్ష్యాలను సాధించాలని, అందించిన విద్యా సామగ్రిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వి ద్యార్థుల భవిష్యత్తు కోసం స్వచ్ఛందంగా ముందుకు వచ్చి చేసిన ఈ సేవా కార్యక్రమాన్ని పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు. సమాజంలో విద్యకు ప్రాధాన్యత నిస్తూ ఇలాంటి కార్యక్రమాలు మరెందరికో స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు హేము, రవికుమార్, కిషోర్ సింగ్, రమాదేవి, మోతీలాల్, భద్రూ, రమేష్ తదితరులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కొత్తగూడెం క్లబ్‌లో సోమవారం కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి పర్యటన



టేకులపల్లి,జూలై 11,ప్రజాజ్యోతి: తాటిచెర్ల బొగ్గుగనుల కేటాయింపు, సింగరేణి కార్మికుల సంక్షేమం, బొగ్గు పరిశ్రమ అభివృద్ధికి సంబంధించిన అంశాలపై కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి సోమవారం ఉదయం 10 గంటలకు కొత్తగూడెం క్లబ్‌లో నిర్వహించే కార్యక్రమంలో పాల్గొననున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచంద్రరావు, పార్టీ శాసన సభ్యులు, ఇతర ముఖ్య నాయకులు కూడా హాజరుకానున్నారు.తాటిచెర్ల బొగ్గుగనుల అభివృద్ధి, సింగరేణి కార్మికుల సంక్షేమం, ఉపాధి అవకాశాల విస్తరణ, ప్రాంతీయ అభివృద్ధికి సంబంధించిన కీలక అంశాలపై చర్చించి ప్రజలకు భరోసా కల్పించనున్నట్లు బీజేపీ నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా కార్యదర్శి బోడ పూనియా నాయక్ కోరారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, సింగరేణి కార్మికులు, యువత, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# యూరియా కోసం రైతుల పడిగాపులు

- ఆన్‌లైన్ విధానంతో తీవ్ర గందరగోళం
- మొబైల్ యాప్‌లో బుక్ కాక రైతులకు ఇబ్బందులు
- మీసేవలో కొత్త బుకింగ్ ఆప్షన్ ఇచ్చినా అమలులో సమస్యలు
- యూరియా కొరతతో పంటల సాగుపై ఆందోళన
- వెంటనే ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని రైతుల విజ్ఞప్తి




పాల్వంచ, జూలై 11, ప్రజాజ్యోతి: ఖరీఫ్ సాగు జోరుగా కొనసాగుతున్న వేళ రైతులకు అత్యవసరమైన యూరియా ఎరువుల కోసం తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. యూరియా పంపిణీని పూర్తిగా ఆన్‌లైన్ విధానానికి అనుసంధానం చేయడంతో రైతులు అయోమయానికి గురవుతున్నారు. మొబైల్ యాప్ ద్వారా యూరియా బుకింగ్ సక్రమంగా జరగకపోవడం వల్ల అనేక మంది రైతులు ఎరువులు పొందలేక ఆందోళన చెందుతున్నారు.ఇటీవల తెలంగాణ ప్రభుత్వం యూరియా బుకింగ్ కోసం మీసేవ కేంద్రాల్లో కొత్త ఆప్షన్ అందుబాటులోకి తీసుకొచ్చింది. దీంతో రైతులు ఆశగా మీసేవ కేంద్రాలకు వెళ్లినా, అక్కడ కూడా సాంకేతిక సమస్యలు, సర్వర్ లోపాలు, బుకింగ్ ప్రక్రియలో ఇబ్బందులు ఎదురవు తున్నాయని రైతులు వాపోతున్నారు. పలుచోట్ల బుకింగ్ పూర్తికాకపోవడంతో రైతులు నిరాశతో వెనుదిరుగుతున్నారు.ప్రస్తుతం వరి, పత్తి, మొక్కజొన్న తదితర పంటలకు యూరియా అత్యవసరంగా అవసరమైన సమయంలో ఎరువులు అందకపోవడం రైతులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. సరైన సమయంలో యూరియా వేయకపోతే దిగుబడిపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఆన్‌లైన్ విధానం వల్ల గ్రామీణ ప్రాంత రైతులు మరింత ఇబ్బందులు పడుతున్నారని, సాంకేతిక పరిజ్ఞానం లేని రైతులు బుకింగ్ చేయలేక ఇబ్బంది పడుతున్నారని రైతు సంఘాలు పేర్కొంటున్నాయి. ప్రభుత్వం ఆన్‌లైన్ విధానాన్ని మరింత సరళీకృతం చేయడంతో పాటు, అవసరమైతే ఆఫ్‌లైన్ విధానంలో కూడా యూరియా పంపిణీకి అవకాశం కల్పించాలని వారు కోరుతున్నారు.అలాగే మీసేవ కేంద్రాల్లో ఏర్పడుతున్న సాంకేతిక సమస్యలను వెంటనే పరిష్కరించి, రైతులకు సులభంగా యూరియా బుకింగ్ జరిగేలా చర్యలు తీసుకోవాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. యూరియా సరఫరా సజావుగా జరిగితేనే ఖరీఫ్ పంటల సాగు సాఫీగా సాగుతుందని రైతులు అభిప్రాయపడుతున్నారు.

## టీఎస్సీపీఎస్ఈయూ జనజాగరణ బస్సు యాత్రకు ఉపాధ్యాయులు, ఉద్యోగుల మద్దతు




టేకులపల్లి, జూలై 11,ప్రజాజ్యోతి: టీఎస్సీపీఎస్ఈయూ ఆధ్వర్యంలో సీపీఎస్ రద్దు, ఓపీఎస్ అమలు డిమాండ్‌తో నిర్వహిస్తున్న జనజాగరణ బస్సు యాత్ర శనివారం టేకులపల్లి మండలానికి చేరుకుంది. భద్రాచలం నుంచి రాష్ట్ర అధ్యక్షులు స్థితప్రజ్ఞ ప్రారంభించిన ఈ యాత్రలో పీఆర్టీయూ, టీపీటీఎఫ్, టీజీటీఎఫ్ తదితర ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా రాష్ట్ర గిరిజన ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.హాథీరామ్ నాయక్ మాట్లాడుతూ, ఎమ్మెల్యేలుగా ఒక్కసారి ఎన్నికైనా జీవితాంతం పెన్షన్ పొందుతున్నారని, కానీ 30–35 సంవత్సరాలు ప్రభుత్వ సేవ చేసిన ఉద్యోగులు, ఉపాధ్యా యులకు పెన్షన్ లేకపోవడం అత్యంత బాధాకర మని అన్నారు.ముఖ్య మంత్రి ఎన్నికల సందర్భంగా ఇచ్చిన సీపీఎస్ రద్దు, ఓపీఎస్ అమలు హామీని వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ ఉద్యోగులు పదవీ విరమణ అనంతరం పొందుతున్న పెన్షన్ వృద్ధాప్య పెన్షన్ కంటే తక్కువగా ఉంటోందని, కమ్యూటేషన్, గ్రాట్యుటీ వంటి పదవీ విరమణ ప్రయోజనాలు కూడా నాలుగు నుంచి ఐదు సంవత్సరాల ఆలస్యంగా అందడం ఆందోళన కలిగించే విషయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో టీపీటీఎఫ్ నాయకుడు రమణ నాయక్, టీజీటీఎఫ్ నాయకుడు ఫుల్ సింగ్, టీఎస్సీపీఎస్ఈయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, రాజశేఖర్‌తో పాటు పలువురు ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## హేమ్లా తండా డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలి

పాల్వంచ, జూలై 11, ప్రజాజ్యోతి:కరకవాగు గ్రామంలోని హేమ్లా తండా డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించాలని, డ్రైనేజీ నీటిని కాలువ దాటించేలా వంతెన నిర్మాణానికి అవసరమైన అనుమతులు మంజూరు చేయాలని 34వ డివిజన్ కార్పొరేటర్ బట్టు విజయలక్ష్మి–లచ్చిరాం సెవెన్త్ స్టేజ్ సీఈని కలిసి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా హేమ్లా తండా మీదుగా కిన్నెరసాని పర్యాటక ప్రాంతానికి వెళ్లే సందర్శకులతో పాటు స్థానిక ప్రజలు కూడా రాకపోకలు సాగిస్తున్నారని, డ్రైనేజీ నీరు రోడ్డుపై నిల్వ ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం వంతెన నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలని కోరారు.అదేవిధంగా, కేటీపీఎస్ ప్రభావిత ప్రాంతమైన కరకవాగు గ్రామంలో తాగునీటి సౌకర్యాల మెరుగుదలకు మూడు మంచినీటి కుళాయిలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. గాజులగూడెం వెళ్లే మార్గంలోని కెనాల్ మూలమలుపు వద్ద ఒకటి, పెద్దమ్మతల్లి దేవాలయం సమీపంలో ఒకటి, స్థానిక పాఠశాలలో మరొకటి ఏర్పాటు చేయాలని సీఈకు వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో 34వ డివిజన్ కార్పొరేటర్ బట్టు లచ్చిరాం, బలగం నాగ మాచర్ల, చంద్రు స్వామిదాస్, బట్టు సురేష్, బట్టు పాషా, ఉండేటి శాంతివర్ధన్, బట్టు ప్రవీణ్, కళ్యాణ్, గుగులోత్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు





## ట్రైనీ కలెక్టర్ ఆదేశాలతో పాఠశాల శుభ్రత

చర్ల, జూలై 11(ప్రజా జ్యోతి ):ఏజెన్సీలోని మారుమూల గ్రామమైన చర్ల మండలం రాళ్లాపురంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల (ఎంపీపీఎస్) ఆవరణను శనివారం ట్రైనీ కలెక్టర్ మురళి సందర్శించారు.ఈ సందర్భగా పాఠశాల మొత్తం పిచ్చిమొక్కలతో అపరిశుభ్రంగా ఉండటంతో ట్రైనీ కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామస్థులు స్వచ్ఛందంగా పాల్గొని పాఠశాల ప్రాంగణంలోని చెత్తాచెదారాన్ని తొలగించి పరిసరాలను శుభ్రపరిచారు.పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా విద్యార్థులకు ఆరోగ్యకరమైన ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించవచ్చని అధికారులు తెలిపారు. ట్రైనీ కలెక్టర్ ఆదేశాలతో గ్రామస్తులు చురుకైన భాగస్వామ్యంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయగా స్థానికులు ట్రైనీ కలెక్టర్ తీసుకున్న ఈ చొరవను అభినందించారు.